కథానిక

# భూమి గుండ్రంకదూ!

★

వాకాటి పాండురంగారావు

శనివారం మధ్యాహ్నం మూడింటివేళ్ళ ఇంటికి వచ్చేశాడు శేషగిరి...హాల్లో పడకకుర్చీమీద చేరగిలబడి పేపరు చూస్తున్నాడు.

హఠాత్తుగా పేపరుమీద నుంచి పిలిచాడు: "సరోజా!" సమాధానంగా కాఫీ గ్లాసుతో వంటింటి నుండి వచ్చింది సరోజ.

"ఏమిటది?" అన్నాడు శేషగిరి.

చీరెమీద మరకుందేమోనని చూచుకుని —"అబ్బే! ఏమీ లేదే!" అంది సరోజ.

"అదే, నీచేతిలోది—" అని ముక్కుతో చూపించాడు శేషగిరి.

అప్పటికి సరోజ చేతులు ఖాళీగ వుండటం వల్ల—"అబ్బే!నా చేతిలో ఏముంది—?" అంది మెరుస్తున్న కళ్ళతో.

"ఓస్! ఏం తెలివి ఏం తెలివి!...ఇప్పుడే క్రింద పెట్టేసినదేమిటీ— అని అడుగుతున్నాను...."

"ఓస్! ఏం ప్రశ్న ఏం ప్రశ్న !!...."

" 'పతివ్రత అయిన భారతసతికి పతియె గతియని సతతము ....' "

"ఆపండోయ్ ... ఆపండి!!" సరోజ అర చెయ్యి శేషగిరి పెదవులను ముద్దెట్టుకుంది.

"హుం ... నీచెయ్యికూడా ఆ వాసనే..." అప్రిలాంచనంగా విసుక్కున్నాడు శేషగిరి.

"ఏం వాసనా?" ఆశ్చర్యపడింది సరోజ.

"అదే ఆగ్లాసులోని ద్రవం, పాశ్చాత్య సాంప్రదాయం ప్రసాదించిన హాలాహలం, భారతీయ సంస్కృతి పాలిట శాపమయిన పానీయం..."

కంచుగంటలా నవ్వింది సరోజ. పాల సముద్రం లాటి మోహంమీద ముంగురుల అలలు ముగ్గులు వేయగా ఒక్క నిముషంసేపు అందెలు వర్షించింది సరోజ.

"ఇదిగో ... ఏమిటా నవ్వు...హుంయ్!" అని సరోజ చెవి మెలేశాడు శేషగిరి.

"ఏమండోయ్! చెవులు మీకూ వున్నాయి."

"హన్నా !! ఆంధ్రమహిళలో ఇంత..."

"...మరిలేకపోతే ఏమిటి ....! చక్కటి చిక్కటి చుక్కలాటి కాఫీ తీసుకొచ్చిపెడితే పాపమూ శాపమూ అంటూ బయులుదేరారేం?... ఇవాళ..... బయట ఎండ తీవ్రంగా వుందేమో కదూ....?" అంది సరోజ, పెదవుల మేర నవ్వును మందలిస్తూ.

"ఎండ తీవ్రంగా వుంటే ..."

"కాస్త ... మతి చలిస్తుంది—"

"నాకు మతిచలిస్తే నీకేం పోయిందోయ్ వెంకటమ్మా!"

"అవును .... నాకేం పోయింది మీ పొట్ట ముక్కు వనజం పోతుంది కాని ..."

"అదిగో ... మాట్లైపిస్తు విషయం ..."

"కాఫీ చల్లారిపోతుందండీ సుబ్బారాయుడుగారూ"—అని గ్లాసుని ముందుకు నెట్టింది సరోజ.

"అది చెప్పవచ్చావు ... నిన్న మా ఆఫీసులో ఒకాయన చనిపోయాడు ... చెట్టంత మనిషి.. ఎందుచేత తెలుసా— 'హ్యామోడిక్ అల్సర్'!! అంటే ఏమిటో తెలుసా.... జీర్ణకోశంలో రణం. అది ఎందుచేత వస్తుందో తెలుసా .... కాఫీ తాగడం వల్ల! తెలుసుకోనవె యువతీ ... తెలుసుకో... ఇంతెందుకు?— మొన్నమొన్న న్యూయార్కు ఆరో అవెన్యూలో మన కృష్ణమీనన్ నింపాదిగా సలంగా పడిపోతే కానవుబా—బుములంబా తిద్దరు. వెరో ప్రక్క పట్టుకు లేవదీసి ప్రక్కన డిల్లీ కొట్టు దగ్గర కూచోపెట్టి ఉల్లిపాయ వాసన చూపించారట ...! ఎందుచేత తెలుసా — కృష్ణమీనన్ 'టీ' తాగుతాడు గనకా ... దీనివలన నీతి ఏమిటో తెలుసా—కాఫీ,టీ, లు త్రాగరాదు. ఈ ప్రమాదకరమయిన పానీయాలలో 'కినోటిన్' అనే విషపదార్థం వుంది ... ఈ విష పదార్థం ..... ఏం .... ఎందుకంతలా నవ్వావ్"

"అబ్బే ... ఏమీలేదు చెప్పండి.."

"ఈ 'కినోటిన్' గురించి చిన్నప్పుడు సైన్సు మేష్టారు బోలెడుసార్లు చెప్పివుంటారు... ఈ 'కినోటిన్' ఒక విషం, ఇదొక క్రిమి లాటిది. ఇది ఇట్టే వ్యాపించిపోయి దేహమంతా రణం చేసి పారేస్తుంది. ఆతర్వాత ఎక్స్—రే అనీ, ఆపరేషన్ అనీ నానా యాతనా పడాలి. ఎంత పడినా ఆఖరి విజయం 'కినోటిన్'దే. కనుక 'కినోటిన్' కాదు కాదు కనుక 'కినోటిన్' ఇదిగో సరోజా! ముందు ఆ నవ్వు ఆపుతావా లేదా.."

నవ్వుతో అలసిపోయిన సరోజ ఎగరుస్తూ పలికింది. "మహాశయా! అది 'కినోటిన్' కాదు 'నికోటిన్'—".

"ఏదో ఒక టీక్ బేవేయ్ పెటవా—"

"కాఫీలో వుండేది 'నికోటిన్' కాదండీ శాస్త్రిగారూ— అది 'కెఫిన్' ... 'నికోటిన్' పొగాకులో వుంటుంది....."

"ఇంతకూ ప్రాణం పోయేది ఎందుకో తెలిసిందేం.

"అయినా, విపరీతంగా రోజూ పీకలవరకు పాక్లో తాగితే ఏమయినా చేస్తుందేమో కాని."

"సిటీలో నాకొస్టు సముద్రమూ, సింధురాల్ని పర్వతమూ వినలేదూ, చదువుకోలేదూ—?"

"శుభం ..." అని ఆగ్లాసుగు చేతిని తీసుకుని తాగబోయిన సరోజ చెయ్యిపట్టుకుని ఆపి, ఆగ్లాసును తానందుకుని, దానిని దేవదాసు సినిమా పాత్రలా పైకెత్తి పట్టుకుని దానికేసి దీనంగా చూసి—ఒక్కసారి గ్లాసుని దానిని చుట్టూ త్రిప్పి—గిరుక్కున క్రిందకు దింపి జాలిలోకి చూసినట్లు దానిలోకి తొంగిచూసి—పెదవులతో ఆ వెచ్చటి ఉపరితలాన్ని స్పర్శించాడు. "సరోజా! ఇది నాఆఖరి కాఫీ!... ది లాస్ట్ గ్లాస్" అని మరో గుక్క లాగాడు.

"ప్.. బ్రహ్మాండంగా వుందిస్మీ.." అన్నాడు

"చూశారా మరి .."

"అదే ... ...అలా బ్రహ్మాండంగా ఉంటుంది కనుకనే, అప్పులాలతో తాగేసి, ఆరోగ్యాన్ని పాడు చేసుకుని ఆయుష్షుని పోగొట్టుకుంటాం. అజ్ఞానం ..."

"అయితే, ఇవాళ మీద కాఫీ తాగర్నమాట?"

"ఇకమీదటనుంచి ? రేపొద్దున్నుంచే!"

"పూ... టీ యూ ..."

"అ జోలితుప్పి నిషిద్ధం."

"అయితే పొద్దున్నే ఏం సేవిస్తారూ ?"

"పొద్దున్న తరవాణీ, మధ్యాహ్నం పాలూ !"

"బాగుంది ... అయితే మనకి నెలకు అద్దె పోను కాఫీపొడయితే, సరిపోతుంది."

"వాట్ ! నువ్వు మానవా ?"

"కాఫీ తాగకుండా ఉండలేనండీ —"

"సరోజా ! ఏదీ ఇటు చూడవూ, నా కోసం మానేయ్యి... ఏం ? ... ఇద్దరమూ చక్కగా ... అన్యోన్యంగా చిలకా గోరింకల్లా..."

"ఎవరయినా మనింటికి వస్తే ఇంతకాస్త దోసిలి పట్టమని తరవాణీ పోస్తామంటండీ —"

"ఓవల్టీనులాంటిదేమయినా ఇద్దాము!"

"అయితే,మనకు మట్టుకు తరవాణే ఖర్మ"

"పోనీ మనమూ అదే తాగుదాం !!"

—ఆదివారం తెల్లవారింది.


పళ్ళుతోముకుని శేషగిరి వంటింట్లోకి వెళ్ళి కూర్చున్నాడు. సరోజ కంచుతప్పేలాని కుంపటి మీద పెడుతూంది.

"ఎందుకది — ?" అన్నాడు శేషగిరి.

"అన్నానికి!"

"కాఫీ కానిదే అన్నాని కెం తొందర ?"

సరోజ తిరిగి చూచింది. వాలిక కొరుక్కున్నాడు శేషగిరి.



"ఓ...ఒన్నపూ...కానియ్యి! కానియ్యి! వెధవది మొదటిరోజు కదూ — అందుకేనా రక్తంలో జీర్ణించుకు పోయిన అలవాటేమో—"

"కొంతకాలం పడుతుంది " అని పూర్తి చేసింది సరోజ.

"అవును. మరయితే ..."

"ఇవ్వాళనుంచీ గంట వారుస్తా ... ఎల్లుండి నుండి తరవాటే వుంటుంది. ... ఇవాల్టికి ఓపిక్కను కూడా లేదాయె ... ... ఉత్త పాలు తాగుతారా ?"

"అల్లా పొద్దున్నే ఉత్త పాలు తాగితే డోకొస్తుంది ... ఆ పూట నేమీ పట్టదు"

లేచి ముందు గదిలోకి వెళ్ళాడు శేషగిరి.

రేడియో విందామనుకుని ఆన్ చేశాడు. మద్రాసు పెట్టబోయేసరికి "ఎందుకా—తో—గ—నావో—అంటూ శాస్త్రీయసంగీతం వచ్చింది. గూబ అదిరేటట్లు అనర్థం వాయిస్తాడు మృదంగుడు.

వాల్యూమయినా తగ్గించకుండా సిలోన్‌కు వెళ్ళాడు శేషగిరి. కాలు తొక్కిన కుక్కలా 'కుయ్యో' మంది ట్రంపెట్. "ఛీ. ఛీ సరియైన సంగీతం ఎక్కడా అఘోరించదేం" అని రేడియోఆపి కూర్చున్నాడు.

వంటింట్లోనుండి గిన్నెకు గరిట తగలడం, కుంపటి విసరటం, బియ్యం చెరగటం, వగైరా శబ్దాలు వినబడుతున్నాయి. కుర్రాడొచ్చి పేపరు పడేస్తే, అది అందుకున్నాడు ఆకలితో.

"బ్రెజిల్‌లో అంతర్యుద్ధం" అని మొదటిపేజీలో పెద్ద శీర్షిక. వద్దు మొర్రో అంటున్న కొలదీ, "బ్రెజిల్‌లో ముఖ్యమయిన పంట కాఫీ—" అని ఘోషించసాగింది, చిన్నప్పటి జాగర్ఫీ. "ఏడికెళ్తే నారాయన కోవోయ్ .. అంత దూరదగా వుంటే ఒరాంగివేలో అరటిపండ్ల రంగేమిటి చెప్పు...! చావ వుంటే స్ట్రాప్పీ కొండలు ఎక్కడ తగిల్దాయో పిదప చూద్దాం —" అని జాగ్రఫీని గదమాయించి మూడో పేజీకి వెళ్ళాడు శేషగిరి.

నీలగిరి ఎస్టేట్ల తోటాదార్ల వార్షిక సమావేశంలో కాఫీబోర్డు చెయిర్మన్ ప్రసంగం రెండు కాలముల నిండా వుంది. పళ్ళు కొరుక్కుంటూ క్రీడారంగం పేజీ కొచ్చాడు శేషగిరి. ... "హు క్రికెట్టు ఆడుతున్నారట ... రోజుకి వంద పరుగులు!! ఎందుకూ ! మా బామ్మకూడా వేసును ఊహాత్రింపరుగులు" అనుకుంటూ వుండగానే "ఫలానా ఆటగాళ్ళు విజయం చేసిన సందర్భంలో బెంగుళూరు కార్పొరేషను ఏర్పాటు చేసిన కాఫీ విందులో శ్రీమతి..." అని భూతద్దంలోగుండా చూసినట్లు పెద్ద పెద్ద అక్షరాలు కనుపించాయి.

పేపరు విసిరికొట్టాడు శేషగిరి.

లేచి నిల్చుని కిటికీగుండా చూస్తున్నాడు.

"గుడ్ మార్నింగ్ !"

"——"

"గుడ్‌మార్నింగ్! శేషగిరి గారూ !" కిటికీగుండా వీధిలోంచి వినిపించింది.

"అయ్యా ... ముడ్‌గార్నింగ్ ?"

"ఏదో తీవ్రాలోచన ..."

"అవునండి హి...హి...."

"వస్తా !"

ఆ తల వెళ్ళిపోయింది.

"ఎవరది ... ఏదో అన్నట్లుందే —" అని ఒక్క నిముషం బాధ పడి పూరుకుంది శేషగిరి మెదడు. అలా కిటికీగుండా చూస్తూ, నిల్చుండి పోయాడు.

బ్యాండుమేళంతో ఒక సినిమా పెద్దబండి వచ్చింది వీధిలో. అయస్కాంతాన్నంటిపెట్టుకున్న ఇనుప రజనులా ఆ బండి వెంబడి పరుగెత్తుతున్నారు పిల్లలందరూ. ఆ బండి కిరుప్రక్కలా మామిడి తోరణాలమధ్య వేలాడదీసి వున్నాయి బోర్డులు.

"ఆదివారం విడుదల !!

నేడే చూడండి !!!

"మృత్యుంజయాలో" కాఫీ హౌస్"!!!

కిటికీ మూసేసి కుర్చీలో కూలబడ్డాడు శేషగిరి.

వంటింటినుండి కాస్త విశ్రాంతి పుచ్చుకుందామని అటు వచ్చింది సరోజ. ఆమె అడుగుల చప్పుడు విని కళ్ళు తెరిచిన శేషగిరి చూపులు ఆమె ఖాళీ చేతులను చూసి బరువుగా వెనక్కొచ్చాయి.


"సరోజా— టైమెంతా?"

"ఎనిమిదీ!"

"అబ్బా— బోలెడుకాలం గడిచిపోయినట్లుంది." అని రెండు కణతలనూ ఒక్కసారి నొక్కిపట్టుకున్నాడు శేషగిరి. అప్రాంతంలోని నరాలా రక్తనాళాలా ఎక్స్‌ప్రెస్ పరుగెడుతున్న రైలుపట్టాల్లా కొట్టుకుంటున్నాయి.

"ఏమండీ—" ఉలిక్కిపడి ఆశగా ఆమెవైపు చూశాడు.

"అన్నం అయింది....ముద్దపప్పు చేశాను... కాకరకాయ ముక్కలు వేయించనా — లేపోతే, అరటికాయ ఆవపెట్టి వండనా—"



"ఏదయినా ఒక్కటే సరోజా!"

"మీరు — అతలనొప్పి బిళ్ళలు రెండు మింగరాదూ?"

"ఉత్తినే ఆ బిళ్ళలు పుచ్చుకుంటే పని చెయ్యవుగా — అయినా ఫరవాలేదోయ్ — బంగారంలాటి అమ్మాయివి నువ్వు నా ప్రక్కన వుండగా ఇంతకన్న ఎక్కువ బాధల్ని భరించ గలను—" అన్నాడు నీరసంగా నవ్వుతూ.

"మావూళ్ళో అన్నపూర్ణమ్మ గారని ఒకా విడ వుండేదండీ— ఆవిడ ధనియాల కాఫీ పెట్టుకు తాగుతుండేది—"

"ఒక ధనియాలేం. శొంఠి కాఫీ కూడా చేసుకుంటారు...అబ్బా..."

అతడివైపు జాలిగా చూసింది సరోజ. టేబిల్ మీది పుస్తకాల్లో ఒక దానిని తీసి తిరగేశాడు శేషగిరి.

" .....ఈ పుస్తకం రాసిందెవరో తెలుసా సరోజా? .... ఆక్స్‌ఫర్డ్ ఎమ్మే ఒకాయన ఏదో కాలేజీ లెక్చరర్ వుండేవాడని చెబుతుంటానే... ఆయన రాసింది ఈ పుస్తకం .... ఆయన మహా మేధావి, జీవితం అంటే ఏమిటో తెలుసుకున్న వ్యక్తి. ఆయన అంటూండేవారు—"అబ్బా యిలూ! కాఫీ అంటే ఏమిటి? ... గడగడా, చెంబెత్తి పట్టుకుని నోట్లోకి ఏకధారగా కుడితి లాగా పోసుకోవలసింది కాదు.... ఒక చక్కటి గ్లాసులోనో కప్పులోనో పోయించాలి.... ఆ పొగలలోని కమ్మదనాన్ని ఆఘ్రాణించాలి...... ఆబంగారం లాటి రంగుని చూసి మురిసిపోవాలి.. నిదానంగా నాలుకకొసతో నాలుగు చుక్కల్ని పెదవుల మధ్యకు పీల్చి దాని రుచిని అనుభవిం చాలి... ఆహా నెమ్మది నెమ్మదిగా లలితంగా, మధురంగా, రసించుతూ అమృతంలా ఆస్వాదిం చాలి. అది కాఫీ తాగడమంటే ..." అలా ఆదొక కళకింద వివరించి చెప్పేవారాయన. పాపం ఇప్పుడు చనిపోయ్యారు. అక్కడికెళ్ళి కూడా "చూడబ్బాయ్ ఇంద్రుడూ! ఈనాట్యాలూ అవీ తర్వాత చూస్తాను గాని — ముందో సారి విలాస్ కాఫీ ఒకటి తెప్పిద్దూ—" అని ఆ శచీపతి పీఠమీద కూర్చుంటున్నారేమో ఆయన..." తన విట్కుకు తానే నవ్వలేకపోయిన శేషగిరిని చూసిసరోజ—"అయితే అరటికాయే చేస్తాను" అని వంటింట్లోకి వెళ్ళింది.

శేషగిరి చెవుల దగ్గర ఏవేవో శబ్దాలు మొద లెట్టాయి.

నిముషం ఒక యుగమై గడవగా తొమ్మిద యింది.

నెమ్మదిగా, తప్పుచేసిన కుర్రవాడిలా — అడుగుమీద అడుగు వేసుకుంటూ వంటింట్లోకి వెళ్ళాడు శేషగిరి.

కుంపటి విసురుతూంది సరోజ. అరటి కాయ ఘుమామ్మని పరిమళిస్తూంది.

"సరోజా!" అని పిలిచాడు శేషగిరి పెద్ద ఆప రేషన్ తర్వాత పేషంటులా.

"ఏమండి?"

"అదేదో ... కూరకదూ?"

"అవునండీ ... అరటికాయ ... ఆవపెట్టి చేస్తున్నా—"

రెండు నిముషాలు నిశ్శబ్దం పలికింది.

"సరోజా—"

"ఆ"

"సరి...సరి"

"కొంచెం కాఫీ కావాలండీ—"!

దేవతలు పూలవర్షం కురిపించినట్లూ—

వెయ్యి మెరుపులు ఒక్కసారే మెరిసినట్లూ పర్వతాలు, మేఘాలయి తేలినట్లూ—

చల్లటి కెరటాలమీద ఆడుకున్నట్లూ— అన్పించింది శేషగిరికి. "వ్వా... చ్వాల కొద్ధి ధిగా —" అన్నాడు అటూ ఇటూ చూస్తూ.

ఆ పాటికే ఫ్లాస్కుమూత తీసి గ్లాసునిండా వేడి వేడి, కమ్మటి కాఫీని పోసింది సరోజ.

గడగడ సగం గ్లాసుని ఖాళీచేసి, మింగుడు పడక ఓక్షణం ఆగాడు శేషగిరి..

"నా ఆక్స్‌ఫర్డ్ లెక్చరన్నట్లు కుడితిలా"

"అది సరేగాని సరోజా—మా ఆఫీసులో ఒకాయన 'డ్యుయోడినల్ ఆల్సర్' వల్ల పోయా డని చెప్పాను గదూ—"

అవునని తల ఆడించింది సరోజ.

"వెధవ డాక్టర్ల 'డయాగ్నోసిస్' ఎప్పోసార్లు తప్పిపోతూంటూంది!

"అవునవును.—"

"కృష్ణమీనన్ రోజుకు పదిహే—హే—నయ్ సార్లు టీ తాగుతాడని చెప్పానా?"

"లేదండీ—" అపాటికి ఇంకొంచెం ఖాళీ అయింది గ్లాసు. శేషగిరి సామూహాలు మని షవటం ప్రారంభించాడు.

"అది సరేగాని సరోజా! నువ్వు కాఫీతాగడం లేదేం?"

సరోజ తీవ్రంగా కుంపటి విసరడం మొదలెట్టింది. శేషగిరి ఇంకో ప్రశ్నవేశాడు." నేన డక్కముందే ఫ్లాస్కులోకి కాఫీ ఎలా వచ్చింది?!"

విసనకర్రను పారేసి ఇటు తిరిగిన సరోజ పెదవుల మీద వెన్నెల వెలిగింది.

అతడూ నవ్వేశాడు! ★